కవితా కౌముది

# జీవితచక్రం

అనూరాధ బండి

కొన్నిసార్లు మనం విచ్ఛిన్నమవుతుంటాం,
కాదు కాదు మన పరిస్థితులు,
కాదు కాదు కాదు మనం కనుగొన్నవి,
కాదు కాదు కాదు ఆఖరున చెప్పేదేమిటంటే, మన
సుఖాలు.

కాబట్టి ఇప్పుడు, నేను ఒకటి చెప్తాను,

అది,

నీ కలలో ఎవరో మధురస్వరంతో చెవిలో
గుసగుసలాడినట్లో, లేకపోతే
ఉదయాన్నే అమ్మ నిన్ను మేల్కొలుపుతున్నట్లో
ఉంటుంది.

ఇంతకూ, అది ఏమిటంటే,

ప్రపంచంతో అనుసంధానమవ్వమనో
నచ్చినది నమ్మమనో
నీకెదురైన ఎవరోఒకరికి ఏదోఒకటి వివరించమనో
మరియూ పైవన్నీ పునరావృతం చెయ్యమనో..

My dear,

మరి, అందుకే, మనం,
కొన్ని సమయాలలో విచ్ఛిన్నులమవుతుంటాం
పరిస్థితులకు బలహీనులమవుతుంటాం
వ్యవహారాలకు భీతిల్లుతుంటాం
మరి బహుశా మనమందరమూ లోపాల్నే పిలుస్తాం,

కానీ, ఏది సరైనదంటే,
న్యాయాన్నే వెలుపలకు వెదజల్లడం.

My dear,

జీవించిఉండడమన్న ప్రవాహంలో
జీవితం నీకు ఇవ్వచూపేది 'క్షమించడం'
మరియూ అనుమతించేది చేదుని
'మరచిపోవడం'.

కాబట్టి, ఇప్పుడిక
నువ్వు నీకు
సరిపడినంత సంతోషాన్ని పొందడానికి
అర్హతని సంపాదించుకున్నట్లే

★★★

# పొడిచే పొద్దు

బొప్పెన వెంకటేష్

ఉన్నదాన్ని పంచుకు తిని
పరాకతు పరమయిన (కు)పాలకులు
రాజ్యం పులిమిన కాకి బంగారం ఛాయలో
ఒట్టిపోతున్న ప్రజ-
ఇలాంటి అత్యవసర పరిస్థితుల్లో
కనీసం ఒక్కడుంటే ఒక్కడైనా ఉంటాడు
వాడే..
పశ్చిమాన్ని పొడిచే పొద్దు..!!
మేము చేతులు జోడించాం
వాడు పిడికిలి బిగించాడు!
మేం కాళ్లకు చెప్పులేసుకున్నం
వాడు గజ్జె కట్టుకున్నాడు!
మేం గంజి తాగి చల్లబడ్డాం
వాడు గింజను మర్లించిన వాడి పై ఉడుకెత్తాడు!
మేం అడుక్కున్నాం
వాడు ప్రశ్నించాడు,
మేం చూస్తూ చూస్తూ ఊరుకుండి పోయాం
వాడు ఏదో చేయాలని ఏరు దాటాడు,
మేం చిల్లుకానికి చివికిన డప్పు కొట్టాం
వాడు నడి ఒడ్డున దండోరా వేశాడు
ఈ రాజ్యం కూలాలని..!!
జాతినిండా జవసత్వాలు పారలి
చైతన్య గొంతుక కదం తొక్కింది
మడుగు కట్టిన ప్రభుత్వం మీద!!

★★★

# మనసుకు జీవం ఇష్టం

చందలూరి నారాయణరావు

మనసు పుట్టలో రహస్యం ఇష్టం.
ఎవ్వరు తవ్వినా రూపం కనపడదు.
ఎంత తొలిచినా తేమ దొరి ఆరదు.!
హృదయపొరల్లో  చిటికెడు ప్రేమకే
అమృతమైన ఒక్కో క్షణం
వర్తమానానికి ఊపిరై,
చెక్కే ఊహను
చిక్కని నిజాల్లో శుభ్రపరచి
ఇష్టాల చెమికిలద్దితే -
కంటితీరాల్లో పదునెక్కిన కల
చురుకెక్కిన ఒక్కో ఇష్టమై
మనసు జీవం కాగా-
ఏమారని ఆలోచనలు
ప్రవహించి నదిలా మనసు
సంద్రంలా మనిషి హోరెత్తి-
కాలపు తెరల మాటున
జవాబు లేని ప్రశ్నలు
యుద్ధం ప్రకటించి
మౌనం కాలుదువ్వినా,
తెలియని దొరికి
గమ్యం భయపడినా
తెలిసిన లోతుకు
అడుగు తడబడినా,
బతుకు చిత్రంలో
దొరి పొడవునా
మనిషి ఇష్టమే
మనసు జీవం.

★★★

# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

స్వర్గమును నాకు చూపింప వచ్చిరెవరొ
బుద్ధిమాంద్యముతో దాని పొందనైతి
సర్వమును నాకు సిద్ధింప సాధ్యమయ్యె
వలదు వలదంచు హృదయమావలకు నెట్టె

వెనుదిరిగి చూడనెన్నెన్ని వింత స్మృతులు
తలుపు తట్టిన భాగ్యముల్ తరలిపోయె
కాదనిన ననుజేరె భాగ్యములు కొన్ని
తగినదెయ్యది మనలకు తగనిదేది

అన్ని భాగ్యముల్ తగినవే యనగలేము
భౌతికార్థములౌ విభవములు కొన్ని
మానసానందమొసగు సంపదలు కొన్ని
సముచితమ్ములు కావన్ని సర్వులకును

కష్టములు వలదంచు సుఖముల కొరకు
వేయి కన్నులనెల్లెడ వెదకుచుందృ
సౌఖ్యముల దాగియున్న కష్టములవెన్నొ
కష్టముల పొంచియున్న సౌఖ్యములవెన్నొ

కొన్ని సమ్మదమును గూర్చు కొందరికిని
వేరొకరు వానియందు సంప్రీతి గనరు
హృదయమెన్నింటికొరకొ వాంఛించు గాని
యేది విధినిర్ణయమదె ప్రాప్తించు మనకు

COMMENTS